# ఉత్తమ విద్యాసంస్థల్లో తెలంగాణ హవా




ఈనాడు, హైదరాబాద్: దేశవ్యాప్తంగా ఉత్తమ విద్యాసంస్థల్లో తెలంగాణ మరోసారి సత్తా చాటింది. రాష్ట్రంలో కేంద్రీయ విద్యాసంస్థలు ఉండటంతో వాటికి జాతీయస్థాయిలో ఉత్తమ స్థానాలు లభించాయి. రాష్ట్రంలోని కేంద్ర, రాష్ట్ర సంస్థలు ఈసారి తమ స్థానాలను మెరుగుపరుచుకున్నాయి. హైదరాబాద్‌లోని సీబీఐటీ ఇంజినీరింగ్ కళాశాల ఇంజినీరింగ్ విభాగంలో తొలి 100 ర్యాంకుల్లో చోటు దక్కించుకుంది. మొత్తం మీద (ఓవరాల్) ఎన్ఐటీ వరంగల్ ఏకంగా 17 స్థానాలను మెరుగుపరుచుకోవడం విశేషం. ఇంజినీరింగ్ విభాగానికి వచ్చేసరికి ఐఐటీ హైదరాబాద్ తప్ప మిగిలిన వాటి స్థానం దిగజారింది. ఏటా కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ర్యాంకింగ్ నివేదికను విడుదల చేసేవారు. ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున సోమవారం దిల్లీలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ విడుదల చేశారు. మొత్తంగా (ఓవరాల్), విశ్వవిద్యాలయాలు, ఇంజినీరింగ్, జనరల్ కళాశాలలు, మేనేజ్‌మెంట్, ఫార్మసీ, న్యాయ విద్య, ఆర్కిటెక్చర్, మెడికల్ విద్యాసంస్థల విభాగాల్లో ర్యాంకులను కేంద్రం విడుదల చేసింది. విద్యార్థుల సంఖ్య, అధ్యాపకులు- విద్యార్థుల నిష్పత్తి, బడ్జెట్- వినియోగం, నాణ్యమైన పరిశోధన పత్రాలు, పేటెంట్లు, పరిశోధన ప్రాజెక్టులు, ప్రాంగణ నియామకాలు, వేతనాలు, ప్రముఖ వర్సిటీల్లో విద్యార్థులకు ప్రవేశాలు లభించడం, పీహెచ్‌డీ పట్టాలు అందుకున్న విద్యార్థుల సంఖ్య, ఇతర దేశాలు, రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రవేశాలు పొందిన వారి సంఖ్య, విద్యార్థుల్లో మహిళల శాతం, విద్యాసంస్థ గురించి విద్యావేత్తలు, ప్రజలు, పారిశ్రామికవేత్తలు ఏమనుకుంటున్నారు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని ర్యాంకులు కేటాయించారు.

## ముఖ్యమైన 3 విభాగాల్లో తెలంగాణ విద్యాసంస్థలు

(మొత్తం మీద స్థానం)

| విద్యాసంస్థ | 2018 | 2019 | తేడా |
|---|---|---|---|
| హెచ్‌సీయూ | 11 | 11 | 0 |
| ఐఐటీ హైదరాబాద్ | 22 | 22 | 0 |
| ఓయూ | 45 | 43 | +2 |
| ఎన్ఐటీ వరంగల్ | 78 | 61 | +17 |
| **విశ్వవిద్యాలయాల విభాగంలో...** | | | |
| హెచ్‌సీయూ | 5 | 4 | +1 |
| ఓయూ | 28 | 26 | +2 |
| అగ్రికల్చరల్ వర్సిటీ | 82 | 79 | +3 |
| ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ | 98 | 82 | +16 |
| **ఇంజినీరింగ్ విభాగంలో (200 ర్యాంకుల్లో)** | | | |
| ఐఐటీ హైదరాబాద్ | 9 | 8 | +1 |
| ఎన్ఐటీ వరంగల్ | 25 | 26 | -1 |
| ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ | 38 | 39 | -1 |
| జేఎన్‌టీయూ హెచ్ | 42 | 45 | -3 |
| ఓయూ ఇంజినీరింగ్ కళాశాల | 80 | 83 | -3 |

(గమనిక: వీఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి-107, సీవీఆర్-132, ఏరోనాటికల్ ఇంజినీరింగ్(ఐఏఈ)- 139, బీవీఆర్ఐటీ(హైదరాబాద్)- 147, వర్ధమాన్- 152, పద్మశ్రీ బీవీరాజు(నర్సాపూర్)- 168, అనురాగ్ గ్రూపు- 169, వాసవి- 170, గోకరాజు- 179, కిట్స్ (వరంగల్)- 180 స్థానాల్లో నిలిచాయి).

## దేశంలో మేటి 'ఐఐటీ- మద్రాస్'

- తరువాత స్థానాల్లో ఐఐఎస్‌సీ- బెంగళూరు, ఐఐటీ- దిల్లీ
- ర్యాంకులు విడుదల చేసిన కేంద్ర మానవ వనరుల మంత్రిత్వశాఖ

దిల్లీ: జాతీయస్థాయి విద్యాసంస్థల్లో "ఐఐటీ - మద్రాస్" మేటిగా నిలిచింది. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్(ఐఐఎస్‌సీ)- బెంగళూరు, ఐఐటీ -దిల్లీ వరుసగా రెండు, మూడోస్థానాల్లో నిలిచాయి. దేశంలోని పది అగ్రగామి విద్యాసంస్థల్లో ఏడు ఐఐటీలే కావడం విశేషం. కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ ఈ మేరకు సోమవారం దేశవ్యాప్తంగా పలు విద్యాసంస్థల ర్యాంకులు విడుదల చేసింది. దీని ప్రకారం జవహర్‌లాల్‌నెహ్రూ విశ్వవిద్యాలయం (జేఎన్‌యూ) ఏడు, బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం (బీహెచ్‌యూ) పదో స్థానంలో నిలిచాయి. దిల్లీ విశ్వవిద్యాలయానికి చెందిన 'మిరండా హౌస్' దేశంలోనే అత్యుత్తమ కళాశాలగా విద్యార్థుల మనసు చూరగొంది. ఇదే విశ్వవిద్యాలయానికి చెందిన 'సెయింట్ స్టీఫెన్స్ కళాశాల' నాలుగో ర్యాంకును కైవసం చేసుకుంది. 2016 నుంచి కేంద్ర మానవ వనరుల మంత్రిత్వశాఖ మనదేశంలోని విద్యాసంస్థలకు ర్యాంకింగ్‌లు ప్రకటిస్తోంది.

### టాపర్స్‌లో మహిళలే ఎక్కువగా ఉంటున్నా...

టాపర్స్‌లో, పతకాలు గెలుపొందడంలో మహిళా పట్టభద్రులు ఎక్కువమంది ఉంటున్నా.. ఉన్నత విద్యాభ్యాసంలో మాత్రం తక్కువమంది నమోదవుతున్నారని రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్ పేర్కొన్నారు. ముఖ్యంగా తూర్పురాష్ట్రాల విద్యాసంస్థల్లో ఈ వ్యత్యాసం చాలా ఎక్కువగా ఉందని, ఇది ఆందోళనకరమన్నారు. కేంద్రమానవ వనరులశాఖ ఆధ్వర్యాన సోమవారం నిర్వహించిన విద్యాసంస్థల ర్యాంకింగ్స్ ప్రకటన కార్యక్రమంలో రాష్ట్రపతి పాల్గొన్నారు.

### వరుసగా నాలుగోసారి ర్యాంకు

వడపళని (చెన్నై), న్యూస్‌టుడే: తమ సంస్థకు చేస్తున్న కృషికి తగ్గ ఫలితం దక్కుతున్నందుకు చాలా ఆనందంగా ఉందని ఐఐటీ- మద్రాస్ డైరెక్టర్, ప్రొఫెసర్ భాస్కర రామమూర్తి అన్నారు. ఐఐటీఎంలో ఎకో సిస్టం విధానంతో పరిశోధనల కోసం ఏర్పాటైన పార్కు మరెక్కడా లేదని, దీన్ని అధికారులు గుర్తించారని ఆయన తెలిపారు. గత ఏడాది రెండో ర్యాంకులో ఉండగా, ఈ ఏడాది మొదటి ర్యాంకు సాధించామన్నారు. ఈ రకమైన ర్యాంకు తమ ఇన్‌స్టిట్యూట్‌కు రావడం వరుసగా నాలుగోసారి అన్నారు.

### మరికొన్ని విభాగాల్లో మన విద్యాసంస్థల పరిస్థితి

- తొలిసారిగా సాధారణ కళాశాలల విభాగంలో ఒక కళాశాలకు స్థానం దక్కింది. హైదరాబాద్‌లోని సెయింట్ ఫ్రాన్సిస్ మహిళా కళాశాల 95వ స్థానం పొందింది.
- మేనేజ్‌మెంట్ విభాగంలో హైదరాబాద్ శివారులోని ఇక్ఫాయ్‌కు 26, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీ(ఐఎంటీ)కి 67వ స్థానం దక్కింది.
- ఫార్మసీ విభాగంలో హైదరాబాద్‌లోని కేంద్రీయ సంస్థ నైపర్ 6వ స్థానంలో నిలిచింది. సుల్తాన్ ఉల్ ఉలూమ్ కళాశాల 65వ స్థానాన్ని సాధించింది.
- న్యాయ విద్య విభాగంలో హైదరాబాద్‌లోని నల్సార్ మూడో స్థానం (మొత్తం 15 ర్యాంకులు) పొందింది.
- ఆర్కిటెక్చర్, మెడికల్‌లో ఒక్క విద్యాసంస్థకు కూడా చోటు దక్కలేదు.
- హైదరాబాద్ ఐఐటీకి అటల్ ర్యాంకింగ్ ఆవిష్కరణలో పదో ర్యాంకు దక్కింది.

### ఏపీలో మూడు వర్సిటీలకు జాతీయ ర్యాంకులు

ఈనాడు, అమరావతి: దేశవ్యాప్తంగా ఉత్తమ విద్యా సంస్థల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి ఆంధ్ర, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయాలతోపాటు కేఎల్ యూనివర్సిటీలకు స్థానం దక్కింది. గతేడాదితో పోల్చితే ఆంధ్ర, శ్రీ వెంకటేశ్వర వర్సిటీల ర్యాంకులు మెరుగయ్యాయి. ఆంధ్ర వర్సిటీకి 2018లో 22వ ర్యాంకు లభించగా ఈ ఏడాది 16వ స్థానానికి ఎగబాకింది. శ్రీ వెంకటేశ్వర వర్సిటీకి 2018లో 49వ స్థానంలో నిలవగా.. ఈసారి 48వ ర్యాంకు లభించింది.